క్లుప్తంగా

సాయి నామ సంకీర్తన



సంకీర్తన చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో సోమవారం సాయి నామ సంకీర్తనతో మార్మోగింది. గురుపీఠం ఏర్పాటుకు గ్రామస్తుడు హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ముందుకొచ్చారు. అందులో భాగంగా వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పీఠం, నాగారం సాయిబాబా ట్రస్ట్ సభ్యులతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సంకీర్తన నిర్వహించారు. త్వరలో పీఠం నిర్మించి అందులో సాయిబాబా ఆలయంతో పాటు సేవ కార్యక్రమాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ గురు పీఠం ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ శివకుమార్‌గౌడ్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, యాదగౌడ్, భిక్షపతియాదవ్ యాదగిరి, నర్సయ్య, తదితరులు ఉన్నారు.

కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ కృషి



మాట్లాడుతున్న రవీందర్‌రాజ్‌వర్మ

చేగుంట(తూప్రాన్): కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ కార్మిక సంఘం పని చేస్తుందని బీఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రాజ్‌వర్మ అన్నారు. మండలంలోని వడియారం గ్రామంలో అపోలో ట్యూబ్స్ పరిశ్రమలోని కార్మికులు సీఐటీయూ సంఘంకు రాజీనామా చేసి బీఎంఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐటీయూ నాయకులు రాజకీయాల కోసం కార్మిక పోరాటాల పేరుతో మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సతీష్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి, ప్రదీప్ కుమార్, శ్రీనివాస్, శ్రీశైలం, సుగుణ, నాగభూషణం, జానకీరాం, శ్రీనివాస్, రామస్వామి, నర్సింలు, శ్రీనివాస్ సత్యం, కుమార్, శ్రీనివాస్, రామకృష్ణ, నరేశ్, కార్మికులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామ శివారులో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారి మణికాంత్ మాట్లాడుతూ.. వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుధారాణిపాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం షూరు



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని తుజాల్‌పూర్‌లో సోమవారం శివాలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఐదు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీపీ జ్యోతి, మండల అధ్యక్షుడు మల్లేశ్, భరత్ గౌడ్ మణిదీప్, సుధీర్‌గౌడ్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



పత్తె శ్రీకాంత్

తూప్రాన్: యువకుడు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బుడగ జంగం కాలనీకి చెందిన పత్తె శ్రీకాంత్(19) ఏళ్ల వయస్సు గల యువకుడు ఈ నెల 2న ఓ ప్రైవేట్ సంస్థలో పని చేసేందుకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సదరు సంస్థలో అడిగి తెలుసుకోగా పని కోసం రాలేదని తెలిపారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు పూజలు



చిన్నశంకరంపేట(మెదక్): కొర్విపల్లిలో గాయత్రీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



పెద్దశంకరంపేట(మెదక్): చీలాపల్లిలో అమ్మవారి దీక్ష స్వీకరించిన భక్తులు



అల్లాదుర్గంలో ..



శివ్వంపేట(నర్సాపూర్): గాయత్రి దేవిగా చెండికాంబ

జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం రెండో రోజు అమ్మవారు గాయత్రిదేవిగా, బ్రహ్మచారిణీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరించారు.



హవేళీఘనాపూర్(మెదక్): రాజీపేటలో..



చేగుంటలో గాయత్రి రూపంలో పూజలందుకున్న అమ్మవారు



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో ..



కొడిపల్లిలో..



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో గాయత్రిదేవికి పూజలు చేస్తున్న భక్తులు



కాడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుంటాం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డిని గెలిపించుకొని బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. చేగుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరుతున్న వారితో ఎలాంటి నష్టం లేదని చేగుంటలో బీజేపీ కంటే ఎక్కువ ఓట్లు వేయించడానికి సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పని చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, జిల్లా నాయకులు రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గుంతలమయంగా వాడి - కొత్తపల్లి రోడ్డు



గుంతలమయంగా మారిన వాడి - కొత్తపల్లి వెళ్లే రోడ్డు

హవేళీఘనాపూర్(మెదక్): మండలంలోని వాడి మీదుగా రాజ్‌పేట కొత్తపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కురిసిన వర్షాలతో భారీ వాహనాలు వెళ్లడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మేరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, అంతేకాకుండా వాహనాలు తొందరగా చెడిపోతున్నాయని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్తే గుంతల్లో పడి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

బాల్యవివాహాలు చేయొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సభ్యులు

కొడిపల్లి(నర్సాపూర్): బాల్యవివాహాలు చేయొద్దని కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ మొబిలైజర్ రాజేందర్ తెలిపారు. సోమవారం మండలంలోని నాగ్సాన్‌పల్లిలో కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. పిల్లలకు పెళ్లీడు వచ్చిన తర్వాత పెళ్లి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లం, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసీఎంను తప్పించబోయి.. పోల్‌ను ఢీకొట్టిన కారు

బెలూన్స్ ఓపెన్ కావడంతో తప్పిన ప్రమాదం...

చిన్నశంకరంపేట(మెదక్): ఎదురుగా వస్తున్న డీసీఎం వాహనం తప్పించబోయి కారు అదుపు తప్పి విద్యుత్ పోల్‌ను ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలోని పెద్దవాగు బ్రిడ్జి మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. ఖాజాపూర్ గ్రామానికి చెందిన చిగుల్ల కుమార్ పనిమీదా చేగుంటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వచ్చిన డీసీఎం వాహనాన్ని తప్పించబోయి కారు విద్యుత్ పోల్‌ను ఢీ కొనగా, బెలూన్స్ ఓపెన్ కావడంతో కారు డ్రైవింగ్ చేస్తున్న చిగుల్ల కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న ఖాజాపూర్ ఎంపీటీసీ యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ మహేశ్‌గౌడ్‌లు కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు.

చేగుంట మైనార్టీ మండల అధ్యక్షుడిగా ఉసామొద్దీన్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్ర ముస్లిం మైనార్టీ మండలాధ్యక్షుడిగా ఉసామొద్దీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దుబ్బాక నియోజకవర్గ మైనార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు షకీల్ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ కమిటీ నాయకులు రఫీ, హఫీజ్, నయీం, ఆరీఫ్, రజాక్, జలీల్, సాబేర్‌హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రామాయంపేట(మెదక్): జిల్లా స్వర్ణకారుల సంఘం కార్యదర్శి సుంకోజ దామోదర్, వైశ్య సంఘం మండల కార్యదర్శి అశోక్ సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో జోరుగా చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని అన్ని పార్టీల నాయకులు గుర్తించి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 21 వార్డు బీజేపీకి చెందిన కౌన్సిలర్ నిర్మల భూషణంతో పాటు హవేళీఘనాపూర్ మండలం ఫరీద్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆమె గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు శశిధర్‌రెడ్డి, హవేలిఘనాపూర్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సౌందర్య వినోద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో సభ్యత్వంలేని రోహిత్‌కు టికెట్టా?

నిజాంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు సోమవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతి పాలవుతారని, తిరుతిరెడ్డి, శశిధర్‌రెడ్డి కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయారని ఆమె పేర్కొన్నారు. పార్టీలో సభ్యత్వం లేని మైనంపల్లికి కాంగ్రెస్ టికెట్ కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. కాసులకు కక్కుర్తి పడి కాంగ్రెస్ టికెట్లు అమ్ముకుంటుందని ఆరోపించారు.

హవేళీఘనాపూర్(మెదక్): మండలంలోని ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌తో పాటు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శశిధర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు



సర్పంచ్, కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

చేగుంట(తూప్రాన్): అనర్హులను గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేశారని పొలంపల్లి గ్రామస్తులు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను నిలదీశారు. గ్రామంలో గృహలక్ష్మి కోసం 26 మంది లబ్ధిదారుల ఎంపిక జరిగినట్లు మంజూరు పత్రాలు వచ్చాయి. ఎంపికైనవారిలో కేవలం 6 మంది అర్హులే ఉండగా, అనర్హులను గృహలక్ష్మి లబ్ధిదారులుగా ఎలా గుర్తిస్తారని గ్రామ పంచాయతీ వద్ద కార్యదర్శి సురేశ్, సర్పంచ్ నిర్మల సత్యంను నిలదీశారు. గొడవ పెద్దదిగా కావడంతో చేగుంట ఎస్ హరీశ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అర్హులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులకు వివరిస్తానని ఎస్‌ఐ హామీ ఇవ్వగా గ్రామస్తులు నిరసన విరమించారు.

బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): చెర్లపల్లి పంచాయతీ పరిధిలోని వర్ధవానిచెరువు తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సందడిగా బతుకమ్మ పండగ



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం చిన్న బతుకమ్మ పండగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడారు. మండల కేంద్రం కొడిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రేగోడు పట్టదా..!

- పునర్విభజనతో తీరని అన్యాయం
- కలగా మిగిలిన జూనియర్ కళాశాల
- పదేళ్లుగా సమస్యలతో సతమతం
- ఇబ్బందుల్లో ప్రజలు



గాంధీ విగ్రహానికి సమస్యల పత్రం ఇస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

రేగోడ్(మెదక్): పరిపాలన సౌలభ్యం కోసం సీఎం కేసీఆర్ జిల్లాలు, మండలాలను పునర్విభజన చేశారు. విభజన అంశం బాగానే ఉన్నా ఇక్కడ మాత్రం ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా అభివృద్ధి పనులు జరిగినా ఇంకా చాలా సౌకర్యాల కల్పనకు నోచుకోలేదని మండిపడుతున్నారు.

జిల్లాలు, మండలాల పునర్విభజన సమయంలో రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని స్థానిక జేఏసీ నేతలు 23 రోజులు నిరహార దీక్ష చేయడంతో అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ సంగారెడ్డిలో కలుపుతున్నట్లుగా గెజిట్ విడుదల చేసినా.. మళ్లీ మెదక్‌లో ఉంచి తీరని అన్యాయం చేశారని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానికులు మళ్లీ ఇదే అంశం తెరమీదకు తెచ్చినా.. పాలకులు పట్టించుకోలేదని మండిపడుతున్నారు. రేగోడ్ మండలంలో 103 మంది ఉపాధ్యాయ పోస్టులకు 41 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. దీంతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.

రేగోడ్ ప్రభుత్వ ఆస్పత్రిని యాభై పడకల ఆస్పత్రిగా మారుస్తామని, ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేస్తానని మాజీ ఎమ్మెల్యే చెప్పినా.. ఆచరణకు నోచుకోలేదు. ఏపీజీవీబీ, పోస్టాఫీస్, గ్రంథాలయం కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. బీసీ బాలుర వసతి భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు చేరడం లేదు. రేగోడ్ నుంచి వట్‌పల్లి, రేగోడ్ నుంచి అల్లాదుర్గం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం ఓ కళగానే మిగిలింది. రాయిపల్లి - పోచారం రోడ్డు అధ్వానంగా మారింది. రేగోడ్ - మర్పల్లి మధ్యలో బ్రిడ్జి నిర్మించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రేగోడ్ నుంచి హైదరాబాద్, జహీరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లాలంటే కనీస బస్సులు లేవని ప్రయాణికులు మండిపడుతున్నారు. మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం జరగకపోవడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపకుండా ప్రజలు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారు. సంగారెడ్డిలో కలపాలని చాలా రోజులుగా ఉద్యమం చేస్తున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదు. మెదక్‌లో ఉండటం వలన నేను పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయా.

– శివ, రేగోడ్

సమస్యలపై పట్టింపేది

ప్రజా సమస్యలపై ప్రభుత్వాలకు పట్టింపు లేదు. తొమ్మిదిన్నరేళ్లు కావస్తున్నా.. కనీసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు నోచుకోలేదు. ఇక్కడ ఉన్న 108ను తరలించినా మళ్లీ ఏర్పాటు చేయ్యలేదు. సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదు.

– మహేశ్, రేగోడ్